

పాల్వంచలోని బాపూజీనగర్ ఎల్‌జీఎం చర్చిలో మంగళవారం అర్ధరాత్రి ప్రార్థన చేస్తున్న భక్తులు

విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న పాల్వంచ కేటీపీఎస్ కాలనీలోని సీఎస్ఐ చర్చి



క్రీస్తు జననం.. జగతికి శుభదినం



చండ్రుగొండలోని ఆర్‌సీఎం చర్చిలో మంగళవారం అర్ధరాత్రి కేక్ కట్ చేస్తున్న ఫాదర్ ఇమ్మానియేల్

క్రిస్మస్ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా చర్చిలను ముస్తాబు చేశారు. ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. పలు చర్చిల్లో మంగళవారం రాత్రి 11గంటలకు పాస్టర్లు, ఫాదర్లు కేక్‌లు కట్ చేశాక.. భక్తులు పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇక బుధవారం అంతా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

భక్తులు ఇబ్బంది పడొద్దు

తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం ప్రశాంతంగా జరగాలి

- ఏర్పాట్లలో అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం



ఉత్తర ద్వారం వద్ద ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం : శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడుకల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ముక్కోటి ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. వైకుంఠ ద్వారంలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే అన్ని వర్గాల భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు ఆలయంలోకి వెళ్లే క్రమంలో తోపులాట జరగకుండా రెవెన్యూ, పోలీస్, దేవస్థానం అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం హంస వాహనాన్ని, గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలించారు. తెప్పోత్సవానికి హాజరయ్యే ప్రముఖులు, భక్తులకు వేర్వేరుగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

'గిరిజన పల్లె'కు ఆదరణ పెరగాలి..

ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేలా ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియం, వాటిని ప్రతిబింబించేలా నిర్మిస్తున్న గిరిజన పల్లెకు ఆదరణ పెరిగేలా చూడాలని కలెక్టర్ పాటిల్ అన్నారు. ట్రైబల్ మ్యూజియాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ ప్రాంగణంలో ఖాళీగా ఉన్న భవనాల్లో వెదురు క్రాఫ్ట్ వస్తువుల అమ్మకాలు జరిపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మ్యూజియం ప్రాంగణంలో నిర్మించే గిరిజన పల్లెలో నిర్మించిన వెదురు, మట్టి ఇళ్లలో పర్యాటకులు సేద తీరేలా, గిరిజన వంటకాలను ఆస్వాదించేలా పనులు చేపడుతున్నామని వివరించారు. బొజ్జిగుప్ప, నారాయణపేట గ్రామాలను సందర్శించి రాత్రి అక్కడ బస చేసి, ఆదివాసీ సంస్కృతిని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ దామోదర్‌రావు, ఆలయ ఈఓ రమాదేవి, డీఎస్‌ఓ ప్రభాకర్‌రావు. తహసీల్దార్ శ్రీనివాస్, ఐటీడీఏ ఏఓ సున్నం రాంబాబు, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్, ఈఈ రవీందర్, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావు, జేడీఎం హరికృష్ణ, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శనలకు ఏర్పాట్లు చేయండి..

గోదావరి కరకట్ట వద్ద ఆదివాసీ కళలకు సంబంధించిన క్రాఫ్ట్స్, ఆదివాసీ వంటకాల స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఐటీడీఏ అధికారులకు కలెక్టర్ సూచించారు. గిరిజన సంస్కతిని ప్రతిబింబించేలా వివిధ పాఠశాలల విద్యార్థులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని చెప్పారు. తద్వారా గిరిజన సంస్కృతి అందరికీ తెలియడంతో పాటు ఆదివాసీలకు ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందని అన్నారు.

నేడు, రేపు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధ, గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న ఆయన వేంసూరు మండలం కందుకూరులో జరిగే ఓ కార్యక్రమానికి హాజరయ్యాక స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో బస చేస్తారు. గురువారం ఉదయం భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం నాచారం, గున్నేపల్లిలో గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించనున్న మంత్రి, 11 గంటలకు దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత 11.30 గంటలకు అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం, ములకలపల్లి మండలం కొత్తూరులో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మీదుగా పెనుబల్లికి చేరుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు. ఆతర్వాత కల్లూరు మండలం పాయపూర్, తల్లాడ మండలం పినపాకలో బీటీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

అడవిని కాల్చకుండా చూడాలి

గుండాల: అడవుల్లో నిప్పు పెట్టకుండా స్థానిక అటవీ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని డీఎఫ్‌ఓ కృష్ణ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన ఆళ్లపల్లి మండలం అడవిరామారంలో గుండాల, కాచనపల్లి, ఆళ్లపల్లి, కొమరారం, రేగళ్ల రేంజ్ పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముందుగా గుండాల మండలం గణపురం నుంచి కాలినడకన అడవులను పరిశీలిస్తూ అడవిరామారం చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్లాంటేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అడవుల్లో ఆకురాలే కాలంలో నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వన్యప్రాణులకు హాని కలిగించే వేటగాళ్లపై నిఘా ఉంచాలని, నీటి వనరుల్లో పురుగుల మందు కలపడం, ఉచ్చులు వేయడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో ఇల్లెందు ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, రేంజర్లు నరసింహారావు, జశ్వంత్, కిరణ్, చలపతి, డీఆర్‌ఓ బాలాజీ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని, ఆ తర్వాత పట్టాభిషేక క్రతువును అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.

పెనగడపను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

సింగరేణి సీఎండీ బలరామ్



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): జీకేఓసీ ప్రభావిత ప్రాంతమైన పెనగడప గ్రామాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ భరోసా కల్పించారు. సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అభివద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతు పనులు, ఫర్నిచర్ ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సోలార్ లైట్లు వంటి పనుల వివరాలను అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎస్సార్ నిధులతో ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేయడంలో సింగరేణి ముందుంటుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ రకాల మొక్కలు నాటుతున్నామని, ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గ్రామంలోని 400 ఇళ్లలో కనీసం 1000 మొక్కలు నాటాలన్నారు. ఇంకా గ్రామానికి అవసరమైన చెరువుల పూడిక, వెదురు ప్లాంటేషన్, లైబ్రరీ ఏర్పాటు, చెక్‌డ్యామ్ నిర్మాణం, వైకుంఠధామంలో బోర్లు వంటి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు గ్రామంలోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, జీఎం సీడీఎస్ సుభాని, కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు, జీఎం సుబ్బారావు, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, డీజీఎం బి.శివకేశవరావు, జీకేఓసీ పీఓ శ్రీరమేష్, ఎస్‌ఓఎం తోట సత్యనారాయణ, జీకేఓసీ మేనేజర్ రామచంద్ర మురళి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజ

సింగరేణి(కొత్తగూడెం): నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో సింగరేణి ముందు వరుసలో నిలుస్తుండడం అభినందనీయమని సంస్థ డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు తెలిపారు. సంస్థలో ప్రస్తుతం వినియోగిస్తున్న సాప్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పనులను గడువు కన్నా ముందే పూర్తిచేయడంపై మంగళవారం ఆయన హెచ్‌ఆర్, ఐటీ ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ కాగితపు రహిత సేవల్లో భాగంగా ప్రాజెక్ట్ మేనేజర్ హరప్రసాద్, జీఎం రాంకుమార్ సారథ్యాన 62 గంటల లక్ష్యానికి గాను 48 గంటల్లోనే పూర్తిచేశారని తెలిపారు.

డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని వైద్య విధాన పరిషత్, ప్రాంతీయ ఆస్పత్రుల్లో ఎంబీబీఎస్ వైద్యులను కాంట్రాక్టు పద్ధతిన నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్ డాక్టర్ రవిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట, పాల్వంచలోని ప్రాంతీయ ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గైనకాలజీ, పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్‌తో పాటు ఇతర పోస్టుల్లో నిపుణులైన వైద్యులను నియమిస్తామని వివరించారు. అర్హత, ఆసక్తి గలవారు ఈనెల 31లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఈనెల 30 వరకు ఓపెన్‌స్కూల్‌లో ప్రవేశాలు

కొత్తగూడెం అర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన ప్రస్తుత విద్యాసంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశముందని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.పాపారావు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల కోసం ప్రత్యేక షెడ్యూల్ ప్రకటించినందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు సమీపంలోని ఓపెన్ స్కూల్ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 80084 03522 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని వారు ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎస్ఐఆర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

మణుగూరు రూరల్: హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో ఉద్యోగాల కోసం ఐటీఐ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ సూచించారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, లేబరేటరీ అసిస్టెంట్, ఆర్అండ్ఏసీ, ఎంఎంవీ, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ ట్రేడ్లలో ఐటీఐ పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఈమేరకు అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు http://www.iict.res.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాబోయే వేసవి కాలంలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 33/11 సబ్ స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపునకు చర్యలు చేపడుతున్నామని ఆ శాఖ ఎస్ఈ జి.మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది కాలంగా గరిష్ట డిమాండ్ ఉన్నప్పుడు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం ఎంత ఉందో టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకుని, తదనుగుణంగా కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని అన్నారు. మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు 33 కేవీ ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థను పటిష్టపరుస్తున్నామని, ప్రతీ సబ్‌స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనులు చేపడుతున్నామని వెల్లడించారు. పట్టణాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఆస్పత్రులు, మెడికల్ కాలేజీ, పోలీస్ స్టేషన్లకు అత్యవసరమైతే ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



అమ్మకు కోత కష్టం..

జిల్లాలో ప్రసవాల సంఖ్య	నార్మల్	సిజేరియన్	మొత్తం
ప్రభుత్వ ఆస్పత్రుల్లో	4,391	3,440	7,831
ప్రైవేట్ ఆస్పత్రుల్లో	842	2,604	3,446

గర్భిణులకు తప్పని ఆపరేషన్లు
- ముహూర్తాల నమ్మకంలో తల్లిదండ్రులు
- కానుల కోసం తెగబడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- సాధారణ కాన్పే తల్లీబిడ్డకు శ్రేయస్కరమంటున్న వైద్యనిపుణులు
- జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ఆరు వేలకు పైగా సీ-సెక్షన్‌లే..


భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో సాధారణ ప్రసవం అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న తల్లులు

భద్రాచలంఅర్బన్: శుభ ముహూర్తాలు, మంచి ఘడియలు, నక్షత్రాలు, తిథుల పేరిట యథేచ్ఛగా కడుపు కోతలు జరుగుతున్నాయి. ఉన్నతంగా చదువుకున్నవారు సైతం జననాలకు జాతకాలను ముడి పెడుతున్నారు. తల్లి గర్భం నుంచి దైవేచ్ఛతో స్వేచ్ఛగా బయటకు రావాల్సిన బిడ్డలను మంచి ముహూర్తాల పిచ్చిలో ఆపరేషన్లు చేయించి, తల్లుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. మనుషుల్లోని మూఢ నమ్మకాలను అలుసుగా తీసుకుని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు అడ్డగోలు దోపిడీకి తెరతీస్తున్నారు. బిడ్డకు జన్మనివ్వడానికి మంచి రోజు, నక్షత్రం, ముహూర్తం చూసుకుంటున్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగిపోయింది. చాలా మంది దంపతులు, వారి కుటుంబ సభ్యులు పురోహితుల వద్దకు వెళ్లి ప్రసవాలకు ముహూర్తాలు చూసుకుంటున్నారు. ఫలానా రోజు.. ఫలానా సమయం బాగుందని నిర్ణయించిన తర్వాత డాక్టర్లను కలిసి అదే సమయానికి ఆపరేషన్ చేయాలని కోరుతున్నారు. సుఖ ప్రసవానికి ఆస్కారం ఉన్నా.. సిజేరియన్ వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వైద్యులు సైతం అసలు డెలివరి కావాల్సిన సమయానికి ముందుగానే ఆపరేషన్ చేసి, బిడ్డను చేతిలో పెడుతున్నారు.

సాధారణ కాన్పు క్షేమం..

సాధారణ కాన్పులు తల్లీబిడ్డకు క్షేమం. నాలుగైదు గంటలు పురిటి నొప్పులు భరించాల్సి వచ్చినా భవిష్యత్‌లో చాలా అనారోగ్య సమస్యలు తప్పుతాయి. సాధారణ ప్రసవంతో రక్తస్రావం తక్కువగా ఉంటుంది. తొలిసారి సహజ ప్రసవం అయితే రెండోసారి కూడా సుఖప్రసవం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాన్పు జరిగిన మూడు, నాలుగు రోజుల నుంచే తల్లి అన్ని పనులు చేసుకునే వీలుంటుంది. బిడ్డ పుట్టిన గంటలోగా ముర్రు పాలు తాగించే అవకాశం ఉంటుంది. శిశువుకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువ. పిల్లల్లో తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయి. అందుకే పాతతరం వారు సహజ ప్రసవాల పైనే మొగ్గు చూపేవారు.

ఆస్పత్రులకు కాసుల వర్షం..

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా చేయడం లేదు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రుల్లో ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు మొత్తంగా 3,446 ప్రసవాలు జరిగితే వీటిలో కేవలం 842 మాత్రమే సాధారణ ప్రసవాలు జరిగాయి. 2,604 సిజేరియన్లు జరిగాయి. సాధారణ ప్రసవం చేస్తే తక్కువ ఫీజు వస్తుందని, సిజేరియన్ అయితే ఎక్కువ సొమ్ము వసూలు చేయొచ్చని కొందరు వైద్యులు ఆపరేషన్‌కే మొగ్గు చూపుతున్నారన్న ఆరోపణలున్నాయి. గర్భిణుల కుటుంబ సభ్యులు సైతం ఆస్పత్రి స్థాయి మేరకు ప్రసవానికి రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు ప్యాకేజీలు మాట్లాడుకుని చేయిస్తున్నారు. అలాగే ముహూర్తం నిర్ణయించుకుని ఆ సమయానికే సిజేరియన్ చేయాల్సి వస్తే ఆస్పత్రుల వారు అదనంగా వసూలు చేస్తున్నారు. అనవసర ఆపరేషన్ల కారణంగా తల్లీబిడ్డలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ తెలిసినప్పటికీ కొందరు ముహూర్తాల మోజులో సిజేరియన్ వైపు ఆసక్తి చూపుతున్నారు. ఓ వైపు మూఢనమ్మకాలు, మరోవైపు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు కాసుల కక్కుర్తితో సిజేరియన్ల సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది.

అనర్థమని తెలిసినా..

అవసరం లేకపోయినా ఆపరేషన్ చేస్తే తల్లీబిడ్డ ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది. శస్త్రచికిత్సకు కేవలం గంట సమయమే అయినా భవిష్యత్‌లో తల్లి పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆపరేషన్ సమయంలో శరీరంలోని నాలుగైదు లేయర్లు కోయాల్సి ఉంటుంది. గర్భాశయం నుంచి బిడ్డను బయటకు తీసిన సమయంలో తీవ్ర రక్తస్రావం అవుతుంది. డెలివరీ తర్వాత కనీసం నెలపాటు తల్లికి విశ్రాంతి అవసరమవుతుంది. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. తగిన పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా హెర్నియా, కడుపునొప్పి, వెన్నునొప్పి తదితర సమస్యలు వస్తాయి. సిజేరియన్ చేసుకున్న ప్రతి తల్లికి శాశ్వతంగా కడుపు ఎత్తుగానే ఉంటుంది.

అధికారుల పర్యవేక్షణ ఏది..?

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు పెరుగుతున్నా.. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గైనిక్ ఆస్పత్రులపై నిఘా లేకపోవడంతో నార్మల్ డెలివరీలు చాలావరకు తగ్గిపోయాయి. గతంలో అధికారులు తనిఖీలు చేయడంతో వైద్యులు శస్త్రచికిత్సలు తగ్గించారు. అదే ఇప్పుడు సాధారణ డెలివరీలు పదుల సంఖ్యలో చేస్తే వందల్లో సిజేరియన్లు చేస్తున్నారు.

సిజేరియన్ చేయాల్సిన సందర్భాలివీ..

బిడ్డ ఎదురుకాళ్లతో ఉంటే సిజేరియన్ చేయాల్సి వస్తుంది. శిశువు బయటకు వచ్చేదారి చాలా సన్నగా (కాంట్రాక్టెడ్ పెల్విస్) ఉంటే మాత్రం ఆపరేషన్ తప్పనిసరి. సాధారణంగా తల్లుల ఎత్తు 185 సెంటీమీటర్ల కంటే తక్కువ ఉన్నవారికి బిడ్డ బయటకు వచ్చే దారి సన్నగా ఉండే అవకాశం ఎక్కువ. అలాంటి సమయంలో సిజేరియన్ అవసరం అవుతుంది. కడుపులోని శిశువు బరువు పెరగడం, బిడ్డ అడ్డం తిరగడం, ఉమ్మనీరు తక్కువ ఉన్నప్పుడు, బిడ్డ ఉమ్మనీరు తాగినప్పుడు తల్లికి బీపీ, షుగర్ అధికంగా ఉన్నప్పుడు, కవలలు, ముగ్గురు పిల్లలు జన్మించే సమయంలో సిజేరియన్ చేయాల్సి వస్తుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..



ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లకు సంబంధించి పూర్తి వివరాలను సేకరించి తగు చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా నిఘా ఉంచి సమీక్షిస్తాం. ఒత్తిడి చేసి మరీ సిజేరియన్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వాటిపై విచారిస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ ఆస్పత్రులపై పర్యవేక్షణ పెంచుతాం. ఆస్పత్రుల నిర్వాహకులు తల్లీబిడ్డ ఆరోగ్యం దృష్ట్యా సాధారణ కాన్పులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

సీ-సెక్షన్లు సరికావు..



తొలి కాన్పులోనే సాధారణ ప్రసవానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సీ-సెక్షన్లు చేసుకున్న వారికి రెండో కాన్పులో ఇబ్బందులు తప్పవు. సాధారణ కాన్పువారిని 24 గంటల్లో ఇంటికి పంపిస్తాం. సాధారణ ప్రసవానికి 500 ఎంఎల్, అదే శస్త్రచికిత్సకు అయితే 1,000 ఎంఎల్ రక్తస్రావం అవుతుంది. తక్కువ రిస్క్ ఉన్న గర్భిణులు 12 గంటల నుంచి 14 గంటల వరకు నొప్పులు భరిస్తే సాధారణ ప్రసవమవుతుంది.

– శ్రీనిధి, గైనకాలజిస్ట్, ఏరియా ఆస్పత్రి, భద్రాచలం

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్

కరకగూడెం: వైద్య శాఖ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన పినపాక, కరకగూడెం పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యంపై ప్రతీ ఒక్కరికి నమ్మకం కలిగేలా సేవలందించాలని చెప్పారు. అనంతరం కరకగూడెం ఫార్మసీలోని మందుల రిజిస్టర్లను, వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, విధుల పట్ల అలసత్వంగా ఉండడంతో ఫార్మసిస్ట్ సునీల్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అంతకముందు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలసి నూతన అమ్మఒడి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఐఓ బాలాజీ నాయక్, వైద్యాధికారులు మధు, రవితేజ, శివ కుమార్, హెచ్ఈఓ కృష్ణయ్య పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

వినియోగదారుల హక్కులను కాపాడాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులను కాపాడటానికి 1986లో చట్టం అమలులోకి రాగా.. 2019లో మార్పులు చేసి వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించారని తెలిపారు. రాయితీలు, ఉచిత ప్రకటనలను ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దని, పాస్‌వర్డ్‌లను సులువుగా పెట్టుకోవద్దని, ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. కొనుగోలు చేసిన వస్తువు తయారీ, చిరునామా, గడువు తేదీ, కస్టమర్ కేర్ నంబర్‌ను సరిచూసుకోవాలని పేర్కొన్నారు. డిజిటల్ పేమెంట్లు, క్యూఆర్ కోడ్, మొబైల్ యాప్ ద్వారా చెల్లింపుల విషయంలో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తూకాలలో మోసపోవద్దని, వ్యాపారులు ఉపయోగించే తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ముద్ర వేయించుకుని లైసెన్స్ తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ రుక్మిణి, డీఎం సివిల్ త్రినాథ్ బాబు, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, డీఈఓ వెంకటేశ్వరాచారి, వలంటరీ ఆర్గనైజర్లు జూలూరి రఘుమాచారి, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంస్థ ప్రధాన కార్యదర్శి గుగులోత్ బాలు, మహమ్మద్ రియాజ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అధిక ధరలకు ఎరువుల విక్రయం?

- కాలం చెల్లిన పురుగుల మందుల విక్రయాలు
- పీఏసీఎస్‌లో చోటు చేసుకుంటున్న అక్రమాలు?

గుండాల: ఏజెన్సీ రైతులకు తోడ్పాటు అందించాల్సిన ప్రాథమిక సహకార పరపతి సంఘంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. నిధుల దుర్వినియోగంతో పాటు కాలం చెల్లిన పురుగుమందులను అంటగడుతూ.. అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. వీటికి సంబంధించి ఇటీవలి కాలంలో అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఇదివరకే గన్నీ సంచుల విషయంలో రైతులకు చెల్లించాల్సిన రూ.14 లక్షలు స్వాహా చేసినట్లు బహిర్గతమైంది. కాగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పీఏసీఎస్ ద్వారా ఎరువుల విక్రయాలు జరిగాయి. దీనిలో ఒక్కో ఎరువు బస్తాకు హమాలీతో కలుపుకుని రూ.274 తీసుకోవాల్సి ఉండగా అదనంగా రూ.6 వసూలు చేసినట్లు సమాచారం. దీనిపై అధికారులు రూ.6 లక్షలు రికవరీ చేయాల్సి ఉందని నివేదికను జిల్లా కార్యాలయంలో అందించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ అనుమతి పొందిన ఏడు రకాల కంపెనీలకు చెందిన పురుగులమందులను విక్రయించాల్సి ఉండగా ఇతర పురుగులమందుల దుకాణాల నుంచి తీసుకొచ్చి విక్రయించినట్లు సమాచారం. అదికూడా కాలం చెల్లిన మందులను విక్రయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మరో రూ.8 లక్షలు రికవరీకి ఫైల్ సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. పీఏసీఎస్ కార్యాలయ సమావేశాల నిమిత్తం అధిక బిల్లులు సృష్టించి సుమారు రూ.3 లక్షలు దుర్వినియోగం చేసినట్లు తెలిసింది. ఇక ఆళ్లపల్లి మండలంలో ఏర్పాటు చేసిన ఎరువుల గోదాము నుంచి 164 బస్తాలు మాయం అయినట్లు తెలియడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై డీసీఓ కుర్షీద్‌ను వివరణ కోరగా రిపోర్టులు తమ వద్దకు వచ్చాయని, పరిశీలిన చేయాల్సి ఉందని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ములకలపల్లి: పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన గజ్జల మహేశ్వరి (34)కి పదహారేళ్ల కిందట వివాహమైంది. గర్భవతిగా ఉన్న సమయంలోనే భర్త రాంబాబు చనిపోయాడు. మహేశ్వరి కూలీ పని చేసుకుంటూ కూతురును చదివిస్తోంది. ఒంటరితనంతో బాధపడుతున్న మహేశ్వరి.. సోమవారం ఇంటివద్ద పురుగులమందు తాగగా.. ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు బండ వెంకటరామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు తెలిపారు.

ఆగి ఉన్నలారీని ఢీకొట్టిన మరో లారీ

దమ్మపేట: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటన మండలంలోని మందలపల్లి రాష్ట్రీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మందలపల్లి రహదారిపై ఆగిఉన్న లారీని సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఆగి ఉన్న లారీ పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాల మెకానిక్ గ్యారేజ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్యారేజ్ రేకుల షెడ్డు, ఒక ద్విచక్రవాహనం పాక్షికంగా దెబ్బతిన్నాయి.

లారీని ఢీకొట్టిన బైక్

కొత్తగూడెంఅర్బన్: ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు మంగళవారం మృతి చెందాడు. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. లాలుతండాకు చెందిన భూక్య సురేశ్ (36) రేగళ్ల నుంచి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వైపు వస్తుండగా మార్గమధ్యలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టి తీవ్ర గాయాలపాలయ్యాడు. సురేశ్‌ను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించి.. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఐటీసీ కాలనీలో విషాదం..

శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటీసీ కార్మికుడి దుర్మరణం


సోమేశ్వరరావు (ఫైల్)

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ కాలనీలో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున శ్రీకాకుళం జిల్లా పెద్దకొజ్జియా వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటీసీ పీఎస్‌పీడీలో పనిచేస్తున్న పర్మనెంట్ కార్మికుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు మృతిచెందాడు. ఈ ఘటనలో అతని భార్య కూడా తీవ్రగాయాల పాలైంది. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. విశాఖపట్టణంలోని సీతమ్మధారకు చెందిన కదిరిశెట్టి సోమేశ్వరరావు ఉద్యోగరీత్యా సారపాకలోని ఐటీసీ కాలనీలో నివాసముంటున్నాడు. అతని భార్య, తోడల్లుడు, మరదలు, మరదలు కుమార్తె, మామతో కలిసి ఒడిశాలోని జాజ్పూర్ అమ్మవారి దర్శనానికి కారులో వెళ్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున కారు అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో సోమేశ్వరరావు (48), బంధువులు లావణ్య (43), స్నేహగుప్తా (19) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిస్తోంది. సోమేశ్వరరావు మృతిచెందిన విషయం తెలిసి తోటి కార్మికులు సంతాపం తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

అశ్వారావుపేటరూరల్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. దీంతో కానిస్టేబుల్ స్వల్పంగా గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. అశ్వారావుపేటలోని సబ్ సెంటర్–3లో సెకండ్ ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న అరుణ భోజన విరామంలో స్థానిక బ్యాంక్ వద్దకు వెళ్లింది. ఆ సమయంలో మతిస్థిమితం లేని వ్యక్తి సబ్ సెంటర్‌లోకి వెళ్లి టేబుల్‌పై ఉన్న ట్యాబ్‌ను తీసుకెళ్లాడు. కాగా, బ్యాంక్ నుంచి తిరిగి వచ్చిన ఏఎన్ఎంకు ట్యాబ్ కనిపించ లేదు. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా, సిబ్బంది విచారణ చేశారు. సబ్ సెంటర్ సమీపంలోనే ట్యాబ్ లొకేషన్ చూపించడంతో గాలించారు. సబ్ సెంటర్ పక్కనే ఉన్న శిథిలమైన భవనం లోపల ఉన్న మతిస్థిమితం లేని వ్యక్తి వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో ట్యాబ్ ఇవ్వాలని, పోలీస్ సిబ్బంది కోరగా వాగ్వాదానికి దిగాడు. అంతేకాదు పోలీస్ సిబ్బంది, స్థానికులపై రాళ్లు, కర్రలతో దాడికి యత్నించాడు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ స్వల్పంగా గాయపడ్డాడు. తర్వాత పోలీస్ సిబ్బంది అంతా కలిసి మతిస్థిమితం లేని వ్యక్తిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకొని ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, దాదాపు అరగంటపాటు మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.


మతిస్థిమితం లేని వ్యక్తిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం సమీపంలో తల్లాడ - కొత్తగూడెం ప్రధాన రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఖమ్మం వైపు నుంచి వెళ్తున్న కారు.. ముందున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న వెంగన్నపాలెంనకు చెందిన వల్లోజి నీరజ్, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన ఆదిత్య తీవ్రంగా గాయపడ్డారు. యువకులు ఇద్దరికి కాళ్లు విరిగాయి. కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లగా, బైక్ నుజ్జునుజ్జయింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

